సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం। 27। ఆగస్టు। 2024



టన్ను చీనీ రూ.22,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22,500 పలికాయి. మార్కెట్‌కు 377 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టం రూ.7, సరాసరిన రూ.15 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
36.2°/22.9°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.



పీహెచ్‌సీలో భద్రత పెంచాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పోలీస్ భద్రత ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రసూతి (ఎన్‌సీహెచ్) విభాగంలో 24 గంటలూ మహిళా సిబ్బంది పని చేస్తుంటారు. వైద్యులతో పాటు నర్సులు ఉంటారు. అర్ధరాత్రి సమయంలో కూడా కేసులు వస్తుంటాయి. ఆ సమయంలో మాకు భద్రత కల్పించేందుకు పోలీసుల రక్షణ ఏర్పాటు చేయాలి. పోలీస్ పహారా, సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి. అప్పుడే నిర్భయంగా పనిచేయగలుగుతాం.

– సౌందర్య, మెడికల్ ఆఫీసర్, గుడిబండ



వైద్యులకు రక్షణ కల్పించాలి

ప్రభుత్వాసుపత్రుల్లోని వైద్యులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణం పోసే వైద్యులపైనే దాడులు దురదృష్టకరం. రాత్రి వేళల్లో పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటోంది. అందుకే రాత్రివేళ డ్యూటీ అంటేనే వైద్యులు, సిబ్బంది భయపడుతున్నారు. వైద్యులకు నిర్భయంగా సేవలందించే వాతావరణం కల్పించాలి. అప్పుడే రోగులకు మెరుగైన వైద్యసేవలందుతాయి.

– డాక్టర్ భార్గవ్, హేమావతి పీహెచ్‌సీ, అమరాపురం మండలం



న్యూస్‌రీల్

పెనుకొండ సబ్‌కలెక్టర్‌గా మౌర్య భరద్వాజ్



మౌర్య భరద్వాజ్

పెనుకొండ: శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు ఐఏఎస్‌లకు ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈ క్రమంలో పెనుకొండ సబ్‌కలెక్టర్‌గా మౌర్య భరద్వాజ్‌ను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో మౌర్య భరద్వాజ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

సివిల్స్‌లో 28వ ర్యాంకు..

అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన మౌర్య భరద్వాజ్ 2014లో వరంగల్ ఎన్ఐటీ నుంచి ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఆ తర్వాత ఓ ఎన్ఎంసీ కంపెనీలో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా చేరారు. అయితే ఆ తర్వాత ఆయన సివిల్స్ వైపు గురి పెట్టారు. 2022లో సివిల్స్ పరీక్ష రాసి ఏకంగా 28వ ర్యాంకు దక్కించుకున్నారు. శిక్షణ అనంతరం తొలి పోస్టింగ్‌గా పెనుకొండ సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్



సీజ్ చేసిన టిప్పర్

సాక్షి ఎఫెక్ట్..

కదిరి అర్బన్: మండల పరిధిలోని మిద్దెవారిపల్లి నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ సీజ్ చేశారు. డ్రైవర్ భాను ప్రకాష్‌ను అరెస్ట్ చేశారు. అక్రమ మట్టి తరలింపుపై వ్యవహారంపై 'అన్న చెప్పాడని... అడ్డగోలు దోపిడీ' శీర్షికన ఈ నెల 26న 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. సీజ్ సమయంలోనూ డ్రైవర్ పోలీసులకు ఎమ్మెల్యే పేరు చెప్పడం గమనార్హం.

మాటేంటారా.. మనీ ఇస్తారా..!

- నమ్మకంగా పనిచేస్తాం..కాస్త అటు ఇటుగా చెప్పినవన్నీ చేస్తాం. అంతేకానీ రాజకీయనేతల్లా పోస్టుకింత అని మేమెక్కడ ఇచ్చుకోగలం. పైగా నీది మా కులం కాదుగా అన్నారు. పోస్టు కోసం కులం మార్చుకోలేం కదా... అందుకే మీరూ వద్దు..మీ పోస్టు వద్దని వీఆర్‌కు వెళ్లా.

  – పెనుకొండ నియోజకవర్గంలోని ఓ సర్కిల్‌లో పోస్టు కోసం ప్రయత్నించిన పోలీసు ఆవేదన ఇది.

- నేను చెబితే సార్ చెప్పినట్లే. మీ ఫ్రెండే రూ.5 లక్షలిస్తానన్నాడు. అయినా నీకు మాటిచ్చామని మళ్లీ చెబుతానన్న. నువ్వయితే చెప్పినట్లు వింటావని అందరూ చెప్పారు. అందుకే ఓకే అంటున్నా. మరి ఆ మనీ మ్యాటర్ తొందరగా సెటిల్ చేస్తే నేను ఫోన్ చేసి పోస్టింగ్ వేయిస్తా.

  – వీఆర్‌లో ఉంటూ హిందూపురం సబ్ డివిజన్‌లోని ఓ సర్కిల్‌కు ప్రయత్నించిన అధికారితో ముఖ్యనేత అనుచరుడి బేరమిది.

- సంతకం పెడితే డబ్బే. నీ గురించి మాకు బాగా తెలుసు. గతంలో ఎక్కడెక్కడ ఏం చేశావో కూడా విన్నాం. నువ్వేం చేసుకున్నా మేము అడగం. కానీ పోస్టింగ్ కావాలంటే కనీసంగా రూ.20 లక్షలు పెట్టాల్సిందే. కాదంటే చెప్పు.. మరొకరిని చూసుకుంటాం.

  – హిందూపురం సమీపంలోని ఓ మండలానికి బదిలీ కోరిన తహసీల్దార్‌కు కూటమి నేత ఆఫర్ ఇది.



- పోలీసు బదిలీల్లో 'తమ్ముళ్ల' కలెక్షన్
- అవినీతి, అక్రమాలకు వంతపాడే వారికే ప్రాధాన్యం
- చెప్పినంత ఇచ్చి.. నచ్చినట్లు చేస్తామంటేనే పోస్టింగ్
- డబ్బులిచ్చుకోలేక చాలా మంది వీఆర్‌కే పరిమితం
- గడువు సమీపిస్తున్నా.. ఇప్పటికీ పూర్తి కాని బదిలీ ప్రక్రియ
- విష సంస్కృతిని తీసుకొచ్చారని 'కూటమి'పై విమర్శలు

సాక్షి, పుట్టపర్తి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసు, రెవెన్యూ ఉద్యోగుల బదిలీల విషయంలో కొత్త సంస్కృతిని తీసుకొచ్చింది. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫారసుతోనే బదిలీ ప్రక్రియకు పచ్చజెండా ఊపింది. అంతేకాకుండా బదిలీలన్నీ ఈనెలాఖరు లోపు పూర్తి చేయాలనే షరతు విధించింది. అయితే 'తమ్ముళ్ల' నిర్వాకంతో ఉద్యోగులు బెంబేలెత్తిపోతున్నారు. సిఫారసు లేఖల కోసం వెళ్తే.. 'ఎంత ఇస్తున్నారు? ఎన్ని రోజులు ఉంటారు? ఆ సీటు ఆల్‌రెడీ అయిపోయింది. ఇప్పటికే బేరం కుదిరింది. అంతకుమించి ఇచ్చేట్లు ఉంటే చూద్దాం' అంటున్నారని పోలీసు అధికారులు వాపోతున్నారు. కాగా గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారంతా ఇప్పుడు హాట్ సీట్లలోకి వస్తున్నారు. కులం, డబ్బు ప్రామాణికంగా పదవులు, పోస్టింగులు కట్టబెడుతున్నారు.

కులం, డబ్బే ప్రామాణికం..

తమ నియోజకవర్గాల్లో పోస్టింగ్ ఇవ్వాలంటే డబ్బు, కులానికే కూటమి నేతలు ప్రాధాన్యం ఇస్తున్నారు. తమ సామాజికవర్గం అయి ఉండాలి.. లేదంటే అడిగినన్ని డబ్బులైనా ఇవ్వాలి. అదీ కుదరకుంటే.. మారుమాట్లాడకుండా చెప్పినట్లు చేసేయాలి. ఈ లెక్కనే పోలీసు, రెవెన్యూ బదిలీలు జరుగుతున్నాయి. జిల్లా పరిధిలో ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పోస్టింగ్‌లు పూర్తి చేశారు. నేతల డిమాండ్ మేరకు సమర్పించుకునే వారు దొరక్క ఇంకొన్ని ప్రాంతాల్లో పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పోస్టింగుల కోసం పైరవీలు చేయాల్సిన కర్మ ఏంటని కొందరు... సీనియారిటీని పక్కనబెట్టి.. కులం గోల ఏమిటని మరికొందరు అధికారులు పోస్టింగ్‌ల కోసం ప్రయత్నించడం కూడా మానేశారు.

బేరం కుదరక భర్తీ కాని పోస్టులు..

ఈనెలాఖరులోపు బదిలీలన్నీ పూర్తి చేయాలని ప్రభుత్వ పెద్దలు ఆదేశించారు. అయితే ఇప్పటికీ సగం కూడా పూర్తి కాలేదు. మిగతా సగం సీట్లకు ఎవరి పేర్లు ఖరారు కాలేదు. బేరం కుదరకపోవడమే కారణంగా చెప్పవచ్చు. పోలీసు శాఖకు సంబంధించి ఒక్కో సర్కిల్ ఆఫీసర్‌కు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టుకు రూ.5 లక్షలు అడిగారనే ఆరోపణలున్నాయి. ఎలాంటి అధికారి అనే విషయం పక్కనబెడితే.. ఎంత ఇస్తున్నారనే స్థాయికి కూటమి నేతలు దిగజారిపోయారు. గోరంట్ల, హిందూపురం వన్‌టౌన్, ధర్మవరం వన్‌టౌన్, హిందూపురం రూరల్, హిందూపురం రూరల్ అప్‌గ్రేడ్, ధర్మవరం రూరల్, ముదిగుబ్బ, కదిరి సర్కిళ్లు ఎక్కువ ధర పలికినట్లు తెలిసింది. గడిచిన ఐదేళ్ల పాటు పని చేసిన వారిలో చాలామందికి పోస్టింగులు ఇవ్వకపోవడం వెనుక డబ్బే కారణంగా తెలుస్తోంది. ఇక రెవెన్యూ సంబంధించి తహసీల్దార్ల బదిలీల్లోనూ భారీగానే డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. చిలమత్తూరు, కొత్తచెరువు, ధర్మవరం, హిందూపురం, పుట్టపర్తి, గోరంట్ల మండలాలకు భారీగా డిమాండ్ ఉండగా... అధికారులు కూడా అంతమేర సమర్పించారని సమాచారం.

చెప్పినట్లు వింటే ఒకే..

చాలా నియోజకవర్గాల్లో కూటమి నేతలు ఆదాయ మార్గాన్వేషణలో భాగంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇసుక, మట్టి, రేషన్ బియ్యం అక్రమ రవాణా, కర్ణాటక మద్యం సరఫరా, విక్రయాలు, పేకాట శిబిరాలు, మట్కా నిర్వహణ, కల్తీ కల్లు విక్రయాలపై ఎక్కువ మంది ఆధారపడ్డారు. దీంతో వీటన్నింటినీ చూసీ చూడనట్లు వెళ్లే అధికారులకే గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇలాంటి వాటిని కొందరు ఒప్పుకోని కారణంగా పోలీసుల్లో కొందరు వీఆర్‌లోనే ఉన్నారని సమాచారం.

రౌడీషీటర్‌కు సీఐ సన్మానం

- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- సీఐ తీరుపై పెదవి విరుస్తున్న జనం



రౌడీషీటర్ శ్రీనివాసులును సన్మానిస్తున్న సీఐ ఇందిర

సాక్షి టాస్క్‌ఫోర్స్: కొత్తగా బాధ్యతలు తీసుకునే సీఐలు తమ సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తారు. తోక జాడిస్తే తాట తీస్తామంటూ వార్నింగ్ ఇస్తారు. తద్వారా వారిలో భయం పెంచి శాంతిభద్రతలు అదుపు తప్పకుండా, నేరాల నివారణకు కృషి చేస్తారు. కానీ కొత్తచెరువు అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ ఇందిర మాత్రం వచ్చీరాగానే ఓ రౌడీషీటర్‌కు శాలువా కప్పి సన్మానించి వార్తల్లో నిలిచారు.

భయమా... భక్తా..?

ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కొత్తచెరువు అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐగా ఇందిరను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. దీంతో నాలుగురోజుల క్రితం చార్జ్ తీసుకున్న ఆమె... తనను కలిసేందుకు వచ్చిన కొత్తచెరువుకు చెందిన టీడీపీ నాయకుడు, రౌడీ షీటర్ సాలక్కగారి శ్రీనివాసులుకు శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. శ్రీనివాసులుపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయి. కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌లోనే రౌడీ షీట్ ఓపెన్ చేశారు. అలాంటి వ్యక్తికి కౌన్సెలింగ్ ఇవ్వాల్సింది పోయి సన్మానం చేయడాన్ని స్టేషన్‌లోని సిబ్బందే తప్పుపడుతున్నారు. రౌడీషీటర్ అంటే భయమా... లేక పోస్టింగ్ కోసం సాయం చేశాడన్నా భక్తా.. అని చర్చించుకుంటున్నారు. సీఐ ఇందిర రౌడీషీటర్‌ను సన్మానించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రౌడీషీటర్ శ్రీనివాసులు టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చెప్పినట్లు 'పసుపుబిళ్ల' తీసుకుని వెళ్లాడేమో...అందుకే ఆయన్ను సీఐ సన్మానించారంటూ.. జనం నవ్వుకుంటున్నారు.

పంచాయతీలో బది'లీలలు'

- గందరగోళంగా పీఆర్ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ
- డిప్యుటేషన్‌పై వచ్చిన వారికి మళ్లీ అవే సీట్లు
- జిల్లా సరిహద్దు దాటితే ఒట్టు
- క్షేత్రస్థాయి ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిన ఉన్నతాధికారులు
- ఈఎన్‌సీ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించినా అన్యాయం

- గతంలో పొరుగు జిల్లాలో పోస్టింగ్ దక్కించుకున్న ఓ డీఈఈ స్థాయి అధికారి అనంతపురం ఎస్ఈ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. ఏడాదిగా ఇక్కడే కొనసాగుతున్నారు. రూ.2 లక్షలకు పైబడి వేతనం అందుకునే ఆయన సంతకాలు పెట్టడం, జీతాలు తీసుకోవడానికే పరిమితమయ్యారు. అటువంటి వ్యక్తి తాజాగా జరిగిన బదిలీ కౌన్సెలింగ్‌లో రెగ్యులర్ హోదాలో మళ్లీ అదే పోస్టు దక్కించుకున్నారు.
- జిల్లాకు చెందిన ఓ డీఈఈ చిత్తూరు జిల్లాలో ఎనిమిదేళ్లుగా పని చేస్తున్నారు. సదరు ఉద్యోగిని సొంత జిల్లాకు రావాలని ప్రయత్నించి కౌన్సెలింగ్‌కు హాజరు కాగా, జిల్లాలోకి ఆమె అడుగుపెట్టకుండా ఎస్ఈ కార్యాలయంలో పని చేసే ముగ్గురు సీనియర్ ఉద్యోగులు కలసి అడ్డుకున్నట్లు తెలిసింది. ఇతర జిల్లాలు, మండలాల్లో పని చేసే వారు జిల్లా కేంద్రానికి రాకుండా ఎస్ఈ కార్యాలయ ఉద్యోగులు కొందరు పథకం ప్రకారం అడ్డుకున్నట్లు సమాచారం.

అనంతపురం సిటీ: జోన్–4 పరిధిలోని రాయలసీమ జిల్లాలకు చెందిన పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఉద్యోగులతో సహా అన్ని విభాగాల వారికి రీజనల్ కేంద్రమైన అనంతపురంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ చీఫ్ బి.బాలు నాయక్ ఆధ్వర్యంలో ప్రక్రియ సాగింది. మొత్తం 198 మంది ఉద్యోగులను కౌన్సెలింగ్‌కు పిలిచారు. వారిలో డీఈఈలు 40 మంది ఉండగా, ఏఈలు, ఏఈఈలు 128 మంది, టెక్నికల్ అసిస్టెంట్లు–4, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్లు–2, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు–13 మంది, సూపరింటెండెంట్–1, సీనియర్ అసిస్టెంట్లు–3, ఆఫీస్ సబార్డినేట్లు–4 ఉన్నారు.

చక్రం తిప్పిన జిల్లా కార్యాలయ సిబ్బంది..

బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు కౌన్సెలింగ్‌లో పాతరేశారు. గతంలో ఒక చోట పోస్టింగ్ వచ్చి మరో చోట డిప్యుటేషన్‌పై కొనసాగిన ఉద్యోగులు ఆయా స్థానాల్లోకి రెగ్యులర్ హోదాలో వచ్చేశారు. జెడ్పీ ఆవరణలోని సబ్ డివిజన్ కార్యాలయాలతో పాటు క్వాలిటీ సెల్ విభాగం, పీఐయూ, పీఆర్ఐ విభాగాల్లో పని చేస్తున్న వారు మండలాలకు వెళ్లకుండా తిరిగి ఒక విభాగం నుంచి మరో విభాగానికి వెళ్లడం, లేదంటే ఎస్ఈ కార్యాలయానికి చేరుకున్నారు. ఎటు తిరిగి వారంతా జిల్లా కేంద్రంలోనే ఏళ్ల తరబడి పాతుకుపోవడంతో ఉద్యోగంలో చేరినప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తూ జిల్లా కేంద్రంలో పని చేయాలనుకున్న వారి కలలను కల్లలు చేశారు. అనంతపురంలోని ఎస్ఈ కార్యాలయం సహా క్యూసీ, పీఆర్ఐ, పీఐయూ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు కొందరు మాఫియా అవతారం ఎత్తి బదిలీల్లో చక్రం తిప్పినట్లు తెలిసింది. దీంతో పాటు కొందరు ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి ఉద్యోగి స్థాయిని బట్టి రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది.



కౌన్సెలింగ్‌కు హాజరైన రాయలసీమ జిల్లాల పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు

సిఫార్సులకే పెద్దపీట..

పలుకుబడి లేక, పనే ప్రపంచంగా భావించిన ఉద్యోగులకు ఈ కౌన్సెలింగ్‌లోనూ నిరాశే మిగిలింది. సాక్షాత్తు ఈఎన్‌సీ వచ్చి నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా ఇంత అధ్వానంగా ఉంటుందని తాము ఊహించలేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి నిర్వహించిన కౌన్సెలింగ్‌లో డీఈఈలు, పీఏలు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లెటర్లు తెచ్చుకొని తాము కోరుకున్న సీట్లను దక్కించుకున్నారు.

పీఏలు.. పీఏలుగానే?

జిల్లా ఎస్ఈ కార్యాలయంలో ఐదేళ్లు, అంతకు ముందు ఫారిన్ సర్వీసు కింద ఐదేళ్లు డ్వామాలో, డిప్యుటేషన్‌పై ఇంకో విభాగంలో ఇంకో ఐదేళ్లు మొత్తం 15 ఏళ్లు అనంతపురం జిల్లా కేంద్రంలో పని చేస్తున్న సీనియర్ డీఈఈని 50 కిలోమీటర్ల దూరంలోని నియోజకవర్గ కేంద్రానికి బదిలీ చేసినా అక్కడ కూడా సబ్ డివిజన్ కార్యాలయ పీఏగా పోస్టింగ్ ఇవ్వడంపై దుమారం రేగుతోంది. ఎస్ఈ, ఈఈలకు పీఏలుగా పని చేస్తున్న వారంతా డీఈ స్థాయి అధికారులే. ఇప్పటికే డీఈఈల కొరత ఎక్కువగా ఉంది. ఏఈఈలకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకుంటుండడంతో పనులు ముందుకు సాగక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో పీఏలను డీఈఈలుగా పంపిస్తారనుకుంటే వారిని ఒక చోట నుంచి మరో చోటుకు అదే హోదాలోనే పంపడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

కూలిన కోటగోడ రాళ్లు



పెనుకొండ: చారిత్రక ప్రాశస్త్యం కలిగిన పెనుకొండ కోటకు ముప్పు వాటిల్లుతోంది. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఉనికి కోల్పోతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తూర్పు వాకిలి కోటగోడ దెబ్బతినింది. స్థానికులు సమాచారం అందించినా పురావస్తుశాఖ అధికారులు మాత్రం పట్టించుకోలేదు. ఈక్రమంలో సోమవారం కోటగోడ తూర్పు వైపు భాగంలో ఉన్న రాళ్లు కింద పడ్డాయి. దీన్ని ఇలాగే వదిలేస్తే కోటగోడ మొత్తం కూలి ప్రజలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా... ఎమ్మెల్యే అనుచరులపై కేసు

- ఆక్రమణ కూల్చి.. స్థలం స్వాధీనం

కదిరి టౌన్: ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన ఎమ్మెల్యే కందికుంట అనుచరులు ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు సదరు స్థలంలో నిర్మించిన నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ కూల్చి స్థలం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే...పట్టణంలోని హిందూపురం రోడ్డు సింహకోట పక్కనే ఉన్న 536 సర్వే నంబర్‌లోని 4 సెంట్ల స్థలాన్ని ఎమ్మెల్యే కందికుంట అనుచరులైన కదిరి మూర్తిపల్లికి చెందిన రెడ్డప్ప, జొన్నవీధికి చెందిన పాల హరి కబ్జా చేశారు. ఆ స్థలంలో రూములు నిర్మించి ఫ్రూట్స్ షాపులకు బాడుగకు ఇచ్చారు. దీంతో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం జేసీబీతో నిర్మాణాలను కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. కబ్జాదారులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ డీవీ నారాయణరెడ్డి తెలిపారు.





శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అగళి కేజీబీవీ చిన్నారులు, మడకశిరలో శ్రీకృష్ణుడికి జ్యోతులు తీసుకువెళ్తున్న మహిళలు

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా

- జిల్లా వ్యాప్తంగా వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



ప్రశాంతి నిలయంలో సత్యసాయి భక్తుల నృత్యరూపకం

పుట్టపర్తి టౌన్ : కృష్ణాష్టమి వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. చిన్ని కృష్ణులు, గోపికలు వేషధారణతో చిన్నారులు అలరించారు. పలు ప్రాంతాల్లో శ్రీకృష్ణుడి విగ్రహాలను ఊరేగించారు. ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాల్లో రాధాకృష్ణులు దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



ప్రశాంతి నిలయంలో శ్రీకృష్ణలీలలు నాటకంలో ఓ ఘట్టం



లేపాక్షిలో ఉట్టికొడుతున్న చిన్నారులు

ధర్మవరంలో ఘరానా మోసం

- వ్యాపారం నిమిత్తం రూ.2.25 కోట్ల అప్పు
- ఐపీ పెట్టి నోటీసులు పంపిన సైదం ఆంజనేయులు

ధర్మవరం: పట్టణంలో ఘరానా మోసం వెలుగుచూసింది. చిట్టీలు, ఫైనాన్స్ వ్యాపారం పేరుతో 82 మంది నుంచి రూ.2.25 కోట్ల దాకా అప్పులు తీసుకున్న సైదం ఆంజనేయులు... తాజాగా రుణదాతలకు ఐపీ నోటీసులు పంపారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక శివానగర్‌కు చెందిన సైదం ఆంజనేయులు కొన్నేళ్లుగా చిట్టీలు, ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. వ్యాపారం నిమిత్తం పట్టణానికి చెందిన పలువురి వద్ద అప్పు తీసుకునే వాడు. వడ్డీ సకాలంలో ఇచ్చేవాడు. దీంతో అతను అడగ్గానే అప్పులు ఇచ్చేవారు. ఆ తర్వాత కాలంలో సైదం ఆంజనేయులు అప్పుగా తీసుకున్న సొమ్ములతో జల్సాలు చేశాడు. చివరకు 82 మందికి రూ.2.25 కోట్ల దాకా చెల్లించాల్సి వచ్చింది. వడ్డీకూడా చెల్లించలేని స్థితిలోకి వెళ్లాడు. రుణదాతలు ఒత్తిడి తేవడంతో కొంతకాలంగా కనబడకుండా పోయాడు. ఇటీవల రుణదాతలకు ఐపీ నోటీసులు పంపాడు. దీంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. సైదం ఆంజనేయులు తమవద్ద డబ్బు తీసుకుని బినామీపేర్లతో ఆస్తులు కొన్నాడని, ఇప్పుడు ఐపీ డ్రామా ఆడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం విచారించి న్యాయం చేయాలని కోరుతున్నారు. బాధితుల్లో కొందరు సైదం ఆంజనేయులు మోసం చేసిన తీరును సోషల్ మీడియా వేదికగా వెల్లడించడంతో ఈ అంశం వైరల్‌గా మారి చర్చనీయాంశమైంది.

క్లుప్తంగా

ఐక్య పోరాటాలకు సిద్ధంకండి

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పిలుపు

అనంతపురం టవర్‌క్లాక్‌ : వాల్మీకులను ఎస్టీలోకి చేర్చాలనే అంశంపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆ సామాజిక వర్గానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వాల్మీకి భవన్‌లో ఏపీ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నాయకుల సమావేశం జరిగింది. అంతకు ముందు నగరంలో భారీ బైక్‌ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశానికి ఎంపీతో పాటు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, జెడ్పీ చైర్‌పర్సన్‌ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని ఎన్నో ఏళ్లుగా పోరాటాలు సాగిస్తున్నా ఫలితం దక్కలేదన్నారు. ఇలాంటి తరుణంలో ఐక్య పోరాటాలు తప్ప మరో మార్గం లేదన్నారు. సమావేశంలో వాల్మీకి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కేశవ, జిల్లా అధ్యక్షుడు మాధవయ్య, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు కనుమ ప్రభాకర్‌ ,క్రాంతి నాయుడు, ఉద్యోగుల సంఘం నాయకులు గంగాధర్‌, పల్నాడు వెంకటేశ్వర్లు, గోవిందు, ఆదినారాయణ, శ్రీనివాసులు, నాగార్జున, మధు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

బత్తలపల్లి: తప్పి పోయిన బాలుడి ఆచూకీని పోలీసులు గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాలు... బత్తలపల్లి మండలం పోట్లమర్రి సమీపంలోని అనాథ ఆశ్రమం వద్ద నివాసముంటున్న గోలి సతీష్‌రెడ్డి, మానసారెడ్డి దంపతుల కుమారుడు ఉమామహేశ్వరరెడ్డి సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించారు. ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో ఈదుల ముష్టూరు పరిసరాల్లో తచ్చాడుతున్న బాలుడిని గమనించిన గ్రామస్తులు విచారించారు. సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని బాలుడిని పిలుచుకుని స్టేషన్‌కు చేరుకున్నారు. విచారణలో తల్లిదండ్రుల పేర్లు తెలపడంతో వారిని స్టేషన్‌కు పిలిపించి ఆరా తీశారు. తమ కుమారుడు మానసిక వికలాంగుడని, దీంతో బడికి పంపకుండా ఇంటి వద్దనే ఉంచుకున్నామని వివరించారు. తాము పశువులను మేపునకు తోలుకుని వెళ్లిన సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. కౌన్సెలింగ్‌ అనంతరం బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

జూదరుల అరెస్ట్‌

గోరంట్ల: మండలంలోని కరావులపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్ట్‌ చేసినట్లు సీఐ శేఖర్‌ తెలిపారు. అందిన సమాచారం మేరకు సోమవారం ఉదయం కరావులపల్లి పరిసరాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. ఆ సమయంలో పొలాల వద్ద పేకాట ఆడుతూ 12 మంది పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ.73,370 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, పెనుకొండ కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు.



చాలా భయమేస్తోంది

కోల్‌కతా ఘటన అనంతరం రాత్రిళ్లు ఆస్పత్రుల్లో డ్యూటీ చేయాలంటేనే భయమేస్తోంది. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. వైద్యులు దేవుళ్లతో సమానమంటారు. కాని ఆ దేవుళ్లకే రక్షణ లేకపోతే ఎలా? ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో నిఘా వ్యవస్థ పటిష్ట పరచాలి. పోలీసు కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్‌ ఎస్‌.సంధ్యారాణి, ధర్మవరం

చట్టాలను కఠినతరం చేయాలి

కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార సంఘటన చాలా బాధాకరం. మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టాలంటే ప్రభుత్వం చట్టాలను మరింత కఠినతరం చేయాలి. రాత్రి సమయాల్లో పీహెచ్‌సీల వద్ద భద్రత కరువవుతోంది. ప్రజల ప్రాణాలకు రక్షణగా ఉండే వైద్య సిబ్బందికి మరింత రక్షణ కల్పించాలి.

– సుజిత, స్టాఫ్‌నర్సు, కనగానపల్లి పీహెచ్‌సీ



సిబిల్‌ గుబులు!

- నేడు ప్రతి చిన్న వస్తువు కొనుగోలూ ఈఎంఐ విధానంలోనే
- చెల్లింపుల్లో జాప్యంతో సిబిల్‌ స్కోర్‌కు దెబ్బ
- భవిష్యత్‌లో ఇతర రుణాలు తీసుకోలేని పరిస్థితి
- ఆలస్య రుసుములు, వాటిపైన పన్నుల బాదుడు సరేసరి
- ఆయా కంపెనీల ప్రకటనల వలలో చిక్కుకుంటున్న ప్రజలు
- నియంత్రణ అవసరమంటున్న నిపుణులు



- గౌస్‌ మొహియుద్దీన్‌ ఐదు నెలల క్రితం టీవీ కొన్నారు. గత నెలలో ఈఎంఐ కట్టాల్సిన సొమ్ము కంటే రూ.10 బ్యాంకు ఖ్యాతాలో తక్కువగా ఉండటంతో రూ.580 ఆలస్య రుసుము పడటమే కాకుండా సిబిల్‌ స్కోర్‌ భారీగా తగ్గింది.
- రమేశ్‌ నాయుడు అనే డిగ్రీ విద్యార్థి ఓ ఫైనాన్స్‌ సంస్థ రుణంతో శాంసంగ్‌ మొబైల్‌ కొన్నాడు. నాలుగో నెలలో ఈఎంఐ చెల్లించకపోవడంతో మొబైల్‌ను బ్లాక్‌ చేశారు. తిరిగి దీన్ని పనిచేయించేందుకు ఈఎంఐ కట్టడంతో పాటు రూ.600 ఆలస్య రుసుం చెల్లించాడు. అతడు ఇప్పుడు ద్విచక్ర వాహనం కొనడానికి వెళ్తే.. సిబిల్‌ స్కోర్‌ పడిపోయింది.. రుణం ఇవ్వలేం' అని చెప్పారు.

.. ఇలా ఒకరు, ఇద్దరు కాదు.. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది సిబిల్‌ స్కోర్‌ సరిగా లేక వాహన, వ్యక్తిగత, గృహ రుణాలను పొందలేకపోతున్నారు. చెక్‌ బౌన్స్‌ అయితే భారీగా సిబిల్‌ స్కోర్‌ పడిపోతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఏ రుణం తీసుకున్నా సకాలంలో చెల్లించాలంటున్నారు. ఆయా రుణ సంస్థలు, బ్యాంకులు నిర్దేశించిన తేదీల్లోగా చెల్లింపులు చేయాలంటున్నారు. ఇలా చేస్తేనే చక్కటి సిబిల్‌ స్కోర్‌ సాధ్యమవుతుందని పేర్కొంటున్నారు. సిబిల్‌ సరిగా లేకపోతే ఏ రుణం కూడా మంజూరు కాదని చెబుతున్నారు. – సాక్షి ప్రతినిధి, అనంతపురం



సగటున ఉండాల్సిన కనీస స్కోర్‌ 650

సిబిల్‌ లెక్కలివి..

ఏదైనా రుణం రావాలంటే కనీసం ఉండాల్సిన స్కోర్‌ 600

గృహరుణం కావాలంటే ఉండాల్సిన స్కోర్‌ 700కు పైన

రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ప్రధాన ప్రైవేటు ఫైనాన్స్‌ సంస్థల్లో వస్తువుల కొనుగోలు తీరు ఇలా..	వస్తువు	మొబైల్‌	ఫ్రిజ్‌లు	టీవీలు	ఇతరత్రా ఉపకరణాలు
	రుణగ్రహీతల సంఖ్య (నెలకు)	45,000కు పైగా	38,000 వరకు	51,500కు పైగా	65,800కు పైగా

ఈఎంఐల్లోనే ఎక్కువ..

ఇప్పుడు దాదాపు ప్రతి ఒక్కరూ నెలసరి వాయిదా చెల్లింపు (ఈఎంఐ) విధానంలో వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. వివిధ బ్యాంకులతోపాటు ప్రైవేటు ఆర్థిక సంస్థలు సైతం క్రెడిట్‌ (సిబిల్‌) స్కోర్‌ ఆధారంగా రుణాలు ఇస్తుండటంతో చాలా మంది ఈఎంఐ విధానంలో వస్తువులను కొంటున్నారు. అయితే నిర్దేశిత తేదీల్లోగా ఈఎంఐ చెల్లించకపోవడం, అందుకు తగ్గట్టుగా బ్యాంకులో నగదు నిల్వ ఉంచకపోవడంతో బౌన్సుల బారినపడుతున్నారు. దీంతో భారీగా ఆలస్య రుసుం, దానిపైన ఇతర పన్నులు చెల్లించాల్సి వస్తోంది. అంతేకాకుండా ఫోన్లలో ఆయా రుణ సంస్థలు, బ్యాంకుల ప్రతినిధుల బెదిరింపులూ తప్పడం లేదు.

నియంత్రించుకోకుంటే కష్టం..

ఇప్పుడు చాలా సులువుగా ఆన్‌లైన్‌లోనూ, వివిధ యాప్స్‌ ద్వారా రుణాలు లభిస్తున్నాయి. కేవలం పాన్‌ కార్డు నంబర్‌ను సంబంధిత వెబ్‌సైట్‌ లేదా యాప్‌లో నమోదు చేయగానే కొద్ది నిమిషాల్లోనే రుణం వచ్చేది, రానిదీ తెలిసిపోతుంది. అలాగే వివిధ ఎలక్ట్రానిక్‌ మాల్స్‌, షాపుల్లోనూ పాన్‌ కార్డు నంబర్‌ను నమోదు చేసి వెంటనే ఎంతవరకు రుణం వస్తుందో చెబుతున్నారు. దీంతో తమకు అవసరమున్నా, లేకున్నా చాలామంది ఎలక్ట్రానిక్స్‌ వస్తువులపై ఆసక్తితో రుణాల ద్వారా వాటిని కొనుగోలు చేస్తున్నారు. 'జీరో వడ్డీ', 'ప్రాసెసింగ్‌ ఫీజు లేదు' అంటూ ప్రైవేటు ఫైనాన్స్‌ సంస్థలు ఇచ్చే ప్రకటనల వలలో పడుతున్నారు. ఏ ప్రయోజనం లేకుండా ఆయా సంస్థలు ఎందుకు ఇలా చేస్తాయనే కనీస అవగాహన కూడా లేకుండా వాటి ఉచ్చులో చిక్కుకుంటున్నారు. ఇలా ఆయా ప్రకటనలకు ఆకర్షితులై వస్తువులు తీసుకుని సకాలంలో చెల్లించలేకపోవడంతో భారీగా ఆలస్య రుసుం, ఇతర జరిమానాలు తప్పడం లేదు. అంతేకాకుండా సిబిల్‌ స్కోర్‌ కూడా గణనీయంగా పడిపోతోంది. తద్వారా భవిష్యత్తులో రుణాలు పొందలేని పరిస్థితి తలెత్తుతోంది.

పదిశాతం మందికి పైగా డిఫాల్టర్లే..

రాష్ట్రంలో ప్రైవేటు సంస్థల ద్వారా రుణాలు తీసుకుని సకాలంలో చెల్లింపులు చేయక డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నవారిలో మొబైల్‌ ఫోన్‌లు తీసుకుంటున్నవారు ఎక్కువ మంది ఉన్నట్లు ప్రైవేటు ఫైనాన్స్‌ సంస్థలు చెబుతున్నాయి. సాధారణంగా సిబిల్‌ స్కోర్‌ 650 దాటితేనే ఏ రుణమైనా లభిస్తుంది. అయితే రుణాలు తీసుకున్న వారు నిర్దేశిత తేదీల్లోగా చెల్లించకపోవడంతో ప్రతి పదిమందిలో ఇద్దరు డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రానిక్‌ ఉపకరణాలు కొనుగోలు చేస్తున్న వారిలో రుణాల రికవరీ అత్యంత తక్కువగా ఉన్నట్టు ప్రైవేటు ఫైనాన్స్‌ కంపెనీలు గుర్తించాయి. విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం నగరాల్లో డిఫాల్టర్లు 14 శాతంగా ఉన్నారని ఆయా సంస్థలు చెబుతున్నాయి. జరిమానాలు ఎక్కువగా పడటం, చెక్‌ బౌన్స్‌ కేసులు నమోదు కావడం, ఈఎంఐల చెల్లింపుల్లో జాప్యం వంటివన్నీ అత్యధికంగా ఈ మూడు ప్రాంతాల్లోనే నమోదవుతున్నట్టు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఈ మూడు చోట్లా సిబిల్‌ స్కోర్‌ కూడా గణనీయంగా తగ్గినట్టు తేలింది. ఈ మూడు నగరాలు కాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు మిగతా జిల్లాల్లో సగటున 10 శాతం డిఫాల్టర్లు ఉంటున్నారు.

సకాలంలో చెల్లిస్తేనే సిబిల్‌ బాగుంటుంది..

ప్రస్తుతం సిబిల్‌ స్కోర్‌ చాలా కీలకమైంది. సిబిల్‌కు ఆయా ఫైనాన్స్‌ సంస్థలు చిన్న చిన్న అప్పుల సమాచారాన్ని కూడా ఇస్తాయి. చెల్లింపుల్లో జాప్యం లేదా మొండి బకాయిలు కారణంగా మా దగ్గరకు వచ్చే చాలామందికి సిబిల్‌ స్కోర్‌ లేక రుణాలు ఇవ్వడం లేదు. వస్తువు తీసుకున్నాక సకాలంలో చెల్లిస్తేనే సిబిల్‌ స్కోర్‌ బాగుంటుంది. లేదంటే భవిష్యత్తులో పరపతి లభించడం చాలా కష్టం.

– సునీల్‌ కుమార్‌, మేనేజర్‌, ఎస్‌బీఐ

తాగునీటి పథకం కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

కదిరి అర్బన్‌/బత్తలపల్లి: బకాయి వేతనాలను తక్షణమే మంజూరు చేయాలంటూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కాళసముద్రం పంప్‌ హౌస్‌ వద్ద అర్ధనగ్నంగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ వేతనాలు మంజూరు చేయాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శివ, ఎల్‌.నాయక్‌, టి.నాయక్‌, అశోక్‌, రమణ తదితరులు పాల్గొన్నారు.

అలాగే బత్తలపల్లిలోని విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ సమీపంలోని మంచినీటి ట్యాంక్‌ వద్ద సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఆరు నెలల బకాయి వేతనాలు, ఈఎస్‌ఐ, ఈపీఎఫ్‌ చెల్లించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జగన్‌, మారుతి, బాషా, షేక్‌ మహబూబ్‌బాషా, కేశవ, అనంతయ్య, రాము, జయరాము, సద్గురు, నరసింహులు, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారం దొంగల అరెస్ట్‌

- చోరీ చేసిన గంట వ్యవధిలోనే ఛేదించిన పోలీసులు
- ఆర్టీసీ ప్రయాణికుల నుంచి బంగారాన్ని కాజేసిన నలుగురు మహిళలు



నగలను చూపుతున్న సీఐ వెంకటేష్‌నాయక్‌

ఆత్మకూరు: ఆర్టీసీ ప్రయాణికుల వద్ద ఉంచి బంగారాన్ని అపహరించిన నలుగురు మహిళలను పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఫిర్యాదు అందుకున్న గంట వ్యవధిలోనే నిందితులను సీఐ వెంకటేష్‌ నాయక్‌, సిబ్బంది గుర్తించి అరెస్ట్‌ చేయడం గమనార్హం. వివరాలు... పెద్దవడుగూరు మండలం చిత్రచేడు గ్రామానికి చెందిన శ్రీదేవి మూడు రోజుల క్రితం కణేకల్లు మండలం చంద్రగిరిలోని బంధువుల ఇంట శుభకార్యానికి హాజరయ్యారు. ఈ క్రమంలో సోమవారం ఆమె తిరుగు ప్రయాణమై వస్తూ కళ్యాణదుర్గంలో అనంతపురానికి వెళ్లే బస్సు ఎక్కింది. బస్సు గోళ్ల గ్రామానికి చేరుకోగానే కనగానపల్లి మండలం వేపకుంట గ్రామానికి చెందిన నాగలక్ష్మి ఎక్కింది. అప్పటికే బస్సులో ఉన్న నలుగురు మహిళలు తమ పక్కనే కూర్చొన్న శ్రీదేవి, నాగలక్ష్మికి చెందిన బ్యాగ్‌ల నుంచి బంగారు ఆభరణాలను అపహరించి బస్సు ఆత్మకూరు సెంటర్‌కు చేరుకోగానే దిగారు. ఈ క్రమంలో నాగలక్ష్మి సైతం వేపకుంటకు వెళ్లేందుకు ఆత్మకూరు బస్టాండ్‌లో బస్సు దిగి బ్యాగ్‌ జిప్పులు తెరిచి ఉండడం గమనించి వెంటనే పరిశీలించింది. అందులో తాను ఉంచిన బంగారు నగలు కనిపించలేదు. దీంతో వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో అనంతపురానికి చేరుకున్న శ్రీదేవి సైతం తన బ్యాగ్‌లోని బంగారు నగలు కనిపించకపోవడంతో చోరీ అయినట్లు గుర్తించి కళ్యాణదుర్గానికి చేరుకుంది. అప్పటికే సీఐ వెంకటేష్‌ నాయక్‌ నేతృత్వంలో బృందాలుగా విడిపోయిన పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వడ్డుపల్లి క్రాస్‌ వద్ద వాహన తనిఖీల్లో ఆటోలో అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు మహిళలను అదుపులోకి తీసుకుని పరిశీలించారు. వారి వద్ద 2.50 తులాల లాంగ్‌ చైన్‌ ఒకటి, 3.90 తులాల మరో లాంగ్‌ చైన్‌ లభ్యమయ్యాయి. మహిళలను పోలీస్‌ స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారణ చేయడంతో బస్సులో ప్రయాణికుల నుంచి చోరీ చేసిన వైనాన్ని వివరించారు. కాగా, పోలీసులకు పట్టుబడిన వారు తమది అనంతపురం రూరల్‌ మండలం రాచానపల్లిలోని బీఎస్‌ఆర్‌ కాలనీ అని బుకాయించినట్లు తెలిసింది. అయితే వారి ఆధార్‌ కార్డుల పరిశీలించిన అనంతరం వారు ఏ ప్రాంతానికి చెందినవారో నిర్ధారణ అవుతుందని పోలీసులు తెలిపారు. నిందితుల అరెస్టులో చొరవ చూపిన కానిస్టేబుళ్లు చౌడప్ప, అతిక్‌, సురేష్‌, దస్తగిరి, నాగేంద్రను సీఐ అభినందించారు.

ప్రత్యామ్నాయ విత్తన ధరలు ఖరారు

క్వింటా విత్తన ధరలు, రాయితీలు ఇలా...					
విత్తనం	పూర్తి ధర	80 శాతం సబ్సిడీ	రైతు వాటా	ప్యాకెట్‌ బరువు	పంపిణీ గరిష్టం
ఉలవ	రూ.8,700	రూ.6,960	రూ.1,740	10 కిలోలు	5 ప్యాకెట్లు
పెసలు	రూ.13 వేలు	రూ.10,400	రూ.2,600	రూ.4 కిలోలు	10 ప్యాకెట్లు
అలసంద	రూ.11,300	రూ.9,040	రూ.2,260	8 కిలోలు	5 ప్యాకెట్లు
మినుము	రూ.14 వేలు	రూ.11,200	రూ.2,800	4 కిలోలు	10 ప్యాకెట్లు
కొర్రలు	రూ.8,740	రూ.6,992	రూ.1,748	2 కిలోలు	5 ప్యాకెట్లు

- నేటి నుంచి ఆర్‌ఎస్‌కేల్లో రిజిస్ట్రేషన్లు

సాక్షి ఎఫెక్ట్‌..

అనంతపురం అగ్రికల్చర్‌: ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీకి సంబంధించి కార్యాచరణ మొదలైంది. 'ప్రత్యామ్నాయం' చూపని సర్కారు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై ఆగమేఘాలపై వ్యవసాయ శాఖ స్పందించింది. ఈ క్రమంలో కమిషనరేట్‌ నుంచి ధరలు, సబ్సిడీలు ఖరారైనట్లు జేడీఏ కార్యాలయ వర్గాలు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశాయి. విత్తనం అవసరమైన రైతులు వెంటనే రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని సూచించారు. మంగళవారం నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుందన్నారు. అనంతపురం జిల్లాకు సంబంధించి ఉలవలు, పెసలు, అలసంద, మినుము, కొర్రలు, సజ్జలు, జొన్న విత్తనాలు 27,907 క్వింటాళ్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 18,265 క్వింటాళ్లు కేటాయించారు. వీటిని రైతులకు 80 శాతం రాయితీతో పంపిణీ చేయనున్నారు. ఏపీ సీడ్స్‌ ద్వారా అన్ని రకాల విత్తనాలు రెండు మూడు రోజుల్లోపు సరఫరా కానున్నాయి. జొన్నలు 3 కిలోల ప్యాకెట్‌ పూర్తి ధర రూ.700 కాగా అందులో 80 శాతం రాయితీ రూ.560 పోనూ రైతులు తమ వాటా కింద రూ.140 ప్రకారం చెల్లించాలి. అలాగే సజ్జలు ఒకటిన్నర కిలో ప్యాకెట్‌ పూర్తి ధర రూ.370 కాగా, ఇందులో 80 శాతం రాయితీ రూ.296 పోనూ రైతులు తమ వాటా కింద రూ.74 చెల్లించాల్సి ఉంటుంది. ఇవి రెండు ఒక్కో రైతుకు భూవిస్తీర్ణాన్ని బట్టి గరిష్టంగా 5 ప్యాకెట్లు చొప్పున పంపిణీ చేయనున్నారు.

దాడి చేసి.. కేసు పెట్టించి

- బుక్కపట్నం మండలం మారాల టీడీపీ నేతల దాష్టీకం
- వైఎస్సార్‌ సీపీ నేతలపై దాడి.. పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు



టీడీపీ నేతల దాడిలో గాయపడిన జగన్‌మోహన్‌రెడ్డి



తమపై అకారణంగా టీడీపీ నేతలు దాడి చేసి గాయపరిచారని బుక్కపట్నం పోలీస్‌ స్టేషన్‌లో విచారం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నేతల ఆగడాలు ఎక్కువయ్యాయి. వైఎస్సార్‌ సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని అకారణంగా గొడవలకు దిగుతున్నారు. దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఆ తర్వాత అధికారం అండతో బాధితులపైనే కేసు బనాయిస్తున్నారు. తాజాగా బుక్కపట్నం మండలం మారాలలోనూ టీడీపీ నేతలు రెచ్చిపోయారు. టీడీపీకి చెందిన నగిరి క్రిష్టమ్మ, నగిరి నారాయణస్వామి, నగిరి రాజేష్‌, చెన్నయ్య తదితరులు శనివారం రాత్రి గ్రామంలో వైఎస్సార్‌ సీపీ నేతలను దూషిస్తూ సవాళ్లు విసిరారు. దీంతో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ సుధాకర్‌రెడ్డి, ఆయన సోదరుడు విజయారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, కృష్టారెడ్డి, ధర్మతేజారెడ్డి అకారణంగా ఎందుకు దూషిస్తున్నారని ప్రశ్నించారు. దీంతో రెచ్చిపోయిన టీడీపీ నేతలు తొలుత విజయారెడ్డిపై దాడి చేసి చేతివేలు కొరికి గాయపరిచారు. అనంతరం కర్రలతో దాడికి దిగారు. దీంతో వారి దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన వైఎస్సార్‌ సీపీ నాయకులపై దాడి చేశారు. ఈ ఘటనలో జగన్‌మోహన్‌రెడ్డి తలకు గాయం కాగా, ఐదు కుట్లు పడ్డాయి. అనంతరం టీడీపీ నాయకులు నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి వైఎస్సార్‌ సీపీ నేతలపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కూడా ఎలాంటి విచారణ చేయకుండానే కేసు నమోదు చేసి సోమవారం స్టేషన్‌కు పిలిపించారు. అనంతరం స్టేషన్‌ బెయిల్‌ ఇచ్చి పంపారు. టీడీపీ నాయకులే తమపై దాడి చేసి తమపైనే కేసులు పెట్టించటం దారుణమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ సుధాకర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, విజయారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తమపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని వారు కోరారు.

పాముకాటుతో యువకుడి మృతి



పార్థు (ఫైల్‌)

రొద్దం: మండలంలోని ఆర్‌.కుర్లపల్లికి చెందిన బోయ ఆదినారాయణ కుమారుడు పార్థు (30) పాము కాటుతో మృతి చెందాడు. భార్యతో కలసి ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. విషయాన్ని గుర్తించి కుటుంబసభ్యులకు తెలపడంతో వారు గాలించారు. పాము కనిపించడంతో కాటు వేసినట్లు నిర్ధారించుకుని వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. చికిత్సకు స్పందించక సోమవారం ఉదయం పార్థు మృతి చెందాడు.

వాగులో పడి వ్యక్తి మృతి

కదిరి అర్బన్‌: మండలంలోని వీరేపల్లిపేట వద్ద మద్దిలేరు వాగులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడిని మహారాష్ట్రకు చెందిన నామ్‌దేవ్‌ (30)గా గుర్తించారు. బతుకు తెరువు కోసం వలస వచ్చిన నామ్‌దేవ్‌... సోమవారం ఉదయం చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందినట్లుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

దులీప్‌ ట్రోఫీకి సన్నాహాలు

అనంతపురం కార్పొరేషన్‌/సెంట్రల్‌: అనంతపురం స్పోర్ట్స్‌ సెంటర్‌ వేదికగా దులీప్‌ ట్రోఫీ క్రికెట్‌ మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించి సన్నాహాలు వేగవంతమయ్యాయి. సోమవారం అనంత క్రీడా గ్రామంలోని ప్రధాన మైదానంలో జిల్లా క్రికెట్‌ సంఘం ప్రత్యేక పూజలు నిర్వహించింది. క్యూరేటర్‌ సుమందర్‌ సింగ్‌ సోమవారం ప్రధాన స్టేడియంలోని పిచ్‌, ఔట్‌ ఫీల్డ్‌ను పరిశీలించారు. సెప్టెంబర్‌ 5 నుంచి 22వ తేదీ వరకూ జరిగే ఐదు మ్యాచ్‌లకు ఇండియా స్టార్‌ ప్లేయర్లు శ్రేయస్‌ అయ్యర్‌, సూర్యకుమార్‌ యాదవ్‌, రుతురాజ్‌ గైక్వాడ్‌, అక్షర్‌ పటేల్‌, కేఎల్‌ రాహుల్‌, తదితరులు హాజరుకానున్నారు. కాగా, ఈ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు స్టార్‌స్పోర్ట్స్‌ 1 ముందుకు వచ్చింది. కెమెరాల ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి.

ఆర్గనైజింగ్‌ కమిటీ ఏర్పాటు..

దులీప్‌ ట్రోఫీ నిర్వహణకు సంబంధించి జిల్లా క్రికెట్‌ సంఘం ఆర్గనైజింగ్‌ కమిటీను ఏర్పాటు చేసింది. కమిటీ చైర్మన్‌గా కలెక్టర్‌ డాక్టర్‌ వినోద్‌కుమార్‌ వ్యవహరించనున్నారు. కో చైర్మన్‌గా ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శిగా సయ్యద్‌ షాబుద్దీన్‌ (మాజీ రంజీ క్రీడాకారుడు), కన్వీనర్‌గా కె.మధు ఆచారి(ఏడీసీఏ కార్యదర్శి), సభ్యులుగా సాయికృష్ణ (డైరెక్టర్‌, ఆర్డీటీ), సి.శ్రీకాంత్‌ (మాజీ ఉపాధ్యక్షుడు, ఏడీసీఏ), పి.మల్లికార్జున (మాజీ ఉపాధ్యక్షుడు, ఏడీసీఏ), ఏజేపీ తీర్థ (మాజీ కార్యదర్శి ఏడీసీఏ), జొన్న జయప్రకాష్‌ (మాజీ ఉపాధ్యక్షుడు, ఏడీసీఏ), ఎ.యుగంధర్‌ రెడ్డి (క్రికెట్‌ కోచ్‌, ఏసీఏ)ను ఎంపిక చేశారు.

ఉచిత ప్రవేశం

దులీప్‌ ట్రోఫీ క్రికెట్‌ మ్యాచ్‌లు వీక్షించేందుకు త్వరలో పాస్‌లు జారీ చేయనున్నారు. ఈ మేరకు ఆర్గనైజింగ్‌ కమిటీ ప్రకటించింది. ప్రతి ఒక్కరికీ పాస్‌తో ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. త్వరలో పాస్‌లు జారీకి సంబంధించి విధివిధానాలు రూపొందించి వెల్లడించనున్నారు.